క్లుప్తంగా...

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



గౌతంనగర్: మల్లికార్జుననగర్‌లోని మల్లన్న దేవాలయంలో మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం భక్తి శ్రద్ధలతో ముగిశాయి. ఉదయం నుంచి గణపతి హోమం, దుర్గా, మన్యు సూక్త, రుద్ర హవనంతోపాటు పార్వతి పరమేశ్వరులు, సీతారాముల వారికి శాంతి కల్యాణం, పూర్ణ కుంభ కళశాలతో మూల విరాట్, శిఖరాలకు విశేష అభిషేకాలు నిర్వహిచారు.

ముగిసిన సమ్మర్ స్కేటింగ్ క్యాంప్

మల్లాపూర్: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా మల్లాపూర్ మోడ్రన్ హైస్కూల్లో 40 రోజుల పాటు కొనసాగిన స్కేటింగ్ సమ్మర్ క్యాంప్ శనివారం ముగిసింది. పాఠశాల కరస్పాండెంట్ ముత్యం రెడ్డి హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేయకుండా స్కేటింగ్ వంటి ఆటలను నేర్చుకోవడం అభినందనీయమన్నారు.

ఎమ్మెల్యే కోలుకోవాలంటూ పూజలు



అల్వాల్: ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు త్వరగా పూర్తి స్థాయిలో కోలుకోవాలని శనివారం ఓల్డ్ అల్వాల్ ఆనంద్‌రావునగర్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి ఆలయంలో స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు డాక్టర్ హరిబాబు, అయ్యగారు శ్రీనివాసరావు, నరహరి, సుందరరాజు, హనుమంతరావు ఉన్నారు.

ఆశా కార్యకర్తలకు అర్హత పరీక్షలు నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున హేమలత

మల్కాజిగిరి: సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు అర్హతా పరీక్షలు నిర్వహించి విధుల్లో కొనసాగించాలన్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని జిల్లా ఆశా వర్కర్ల యూనియన్(సిఐటీయూ) అధ్యక్షురాలు హేమలత డిమాండ్ చేశారు. మల్కాజిగిరిలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లు మాతాశిశు మరణాలు తగ్గించడంతో పాటు ఇతర కీలక పనుల్లో విధులు నిర్వహిస్తున్నారన్నారు.ఉద్యోగ అనుభవం ఉన్న వారికి పరీక్షలు నిర్వహించాలన్న నిర్ణయం అర్ధరహితమన్నారు. ఆశా వర్కర్లకు పారితోషకం కాకుండా నిర్ణీత వేతనాన్ని నిర్ణయించాలన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జూన్ 5వ తేదీ ఆశా డే సందర్భంగా పీహెచ్‌సీల వద్ద ధర్నా, 12న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.సమావేశంలో జిల్లా నాయకులు వాసంతి,సుమలత తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి



ఉప్పల్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో ఉప్పల్ చౌరస్తా వద్ద నాయకులు, కార్యకర్తలతో శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేసారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో మహిళలకు, క్రీడాకారులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాట్లాడుతూ రెజ్లర్లకు న్యాయం జరిగే వరకు పోరాటాలు, నిరసన కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయన్నారు. మాజీ కార్పొరేటర్ గోల్లూరి అంజయ్య, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బోడుప్పల్: ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి అన్నారు. 5వ డివిజన్‌కు చెందిన శ్రీనివాస్‌కు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.14 వేలును ఆయన శనివారం అందజేశారు. ఈ సందర్భగా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం రాష్ట్రం ఎన్నో సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నవీన్, సతీష్‌కుమార్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని ఎత్తుకెళ్లిన వృద్ధుడు

సకాలంలో స్పందించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

మల్కాజిగిరి: ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారిని ఓ వృద్ధుడు ఎత్తుకెళ్లాడు. సకాలంలో స్పందించిన పోలీసులు స్థానికులు సహాయంతో వృద్ధుడిని పట్టుకొని చిన్నారిని క్షేమంగా తల్లితండ్రులకు అప్పగించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. భరత్‌నగర్‌కు చెందిన నరేందర్ మెకానిక్ పనిచేస్తున్నాడు. అతనికి నాలుగు సంవత్సరాల కూతురు ఉంది. శనివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారి కనిపించలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రలు పోలీసులకు సమాచార అందించారు. ఓ వృద్ధుడు ఎత్తుకెళ్లినట్లుగా సీసీ పుటేజి ద్వారా గుర్తించారు. దీంతో పోలీసులు స్థానికులతో కలిసి వెతికారు. భరత్‌నగర్ నుంచి రాధికా థియేటర్ వెళ్లే రోడ్డులో పాపతో ఉన్న వృద్ధుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పాపను క్షేమంగా తల్లితండ్రులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దుదాం

మేడిపల్లి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కమిషనర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో సమీకృత వ్యర్థాల శుద్ధీకరణ పార్క్‌లో స్టడీటూర్ ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ పరిధిలో తడి, పొడి చెత్త సేకరణ, తడి చెత్తనుంచి ఉత్పత్తి చేస్తున్న సేంద్రియ ఎరువు, పొడిచెత్త రీసైక్లింగ్ పద్ధతులను మేయర్ ప్రజలకు వివరించాడు. కార్యక్రమంలో కార్పొరేటర్లు,కోఆప్షన్ సభ్యులు, డీఈఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకి పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

రామంతాపూర్ : శ్రీ మహంకాళి దేవాలయంలో శనివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు దొంతి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్‌ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్

అల్వాల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. శనివారం కౌకూర్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో అర్హులైన వారికి ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని చేపట్టిన దీక్ష కార్యక్రమంలో నందికంటీ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల ముందు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షులు నిమ్మ అశోక్‌రెడ్డి, నాయకులు కృష్ణగౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో అలరించిన నాట్యం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన కూచిపూడి, భరత నాట్యం ఆహుతులను అలరించింది. రాధికా సంగీత నృత్య అకాడమి నిర్వహకులు రమణి సిద్ది ఆధ్వర్యలో నిర్వహించిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విశాఖ ప్రకాశ్ శిష్య బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మౌలాలి: మౌలాలి డివిజన్ సంతోషిమాత కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే యూజీడీ పనులను శనివారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ పరిధిలో ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

జాతీయ సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ఉప్పల్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ (ఐఐహెచ్‌పి) ఆధ్వర్యంలో ఈ నెల 25న రామంతాపూర్‌లో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను శనివారం తెలంగాణ నీటి పారుదల శాఖ చైర్మన్ సముద్రాల వేణుగోపాల చారి ఆవిష్కరించారు. ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హోమియో పతిక్ వైద్యులు పెద్ద ఎత్తున పాల్గొన నున్నట్లు కార్యదర్శి డా. ఎంఎస్ రాజు, కన్వీనర్ డా. జి. చంద్రశేఖర్ రావు తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చండి



మల్లాపూర్: తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ పాఠశాలల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ కోరారు. అంగన్‌వాడీ బడి బాట కార్యక్రమంలో భాగంగా శనివారం నాచారం ఇందిరానగర్ అంగన్‌వాడీ పాఠశాలలో అక్షరాభాస్యం,అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సూపరవైజర్ పార్వతి, అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు పరిశీలించిన కార్పొరేటర్



ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ న్యూ ప్రశాంత్ నగర్ బస్తీలో ఓ ఆర్ఆర్–ఫేజ్–2లో జరుగుతున్న మంచి నీటి పైపులైన్ పనులను కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వార ప్రతి ఇంటికి తాగు నీరు అందేలా గొప్ప సంకల్పంతో ముందుకు సాగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన

రామంతాపూర్ : శ్రీరామ కాలనీలోని సింహం కాళీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు మందముల పరమేశ్వర్‌రెడ్డితో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేశవరెడ్డి వెంకటేష్, విష్ణుమూర్తి, అరుణ్, సందీప్ పాల్గొన్నారు.

వ్యక్తిపై నుంచి దూసుకెళ్లిన కంటైనర్

అక్కడిక్కడే మృతి..

కుషాయిగూడ: రోడ్డు పక్కన పడుకున్న ఓ వ్యక్తిపై నుంచి కంటైనర్ దూసుకెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. 50–55 సంవత్సరాల వయసు కలిగిన ఓ గుర్తు తెలియన వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కుషాయిగూడ మెయిన్‌రోడ్డుపై ఉన్న వరుణ్ మోటార్స్ ఎదురుగా పడుకొని ఉన్నాడు. ఆ సమయంలో కార్ల లోడ్‌తో వచ్చిన కంటైనర్ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడిపి రోడ్డు పక్కన పడుకున్న వ్యక్తి తల, పొట్టపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.